క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బడంగ్‌పేట్: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల ఎకో క్లబ్ విద్యార్థులు అన్నారు. ప్రజలకు కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్ విద్యార్థులు 20 ఎలక్ట్రిక్ వాహనలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 40 మంది సభ్యులు కళాశాల నుంచి బడంగ్‌పేట్, నాదర్‌గుల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కళాశాల కార్యదర్శి ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్యం మితిమీరితే ప్రకృతి విలయతాండవాన్ని ఆపలేమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా.మహేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ధనుర్మాస ఉత్సవాలు

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ లలితానగర్‌లోని గడ్డిఅన్నవరక్షేత్ర వీరవెంకట సత్యనారాయణ స్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ వూర నర్సింహగుప్తా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, శనివారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే జనవరి 1వ తేదీన స్వామివారికి వెన్నతో అలంకరణ, విశేష అర్చన ఉంటుందన్నారు. 11న కూడారై ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి 108 గంగాళాలతో పాయసం సమర్పిస్తామన్నారు. జనవరి 14న ఉదయం 9 గంటలకు శ్రీగోదా రంగనాథుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తామన్నారు. సమావేశంలో ఆలయ సలహాదారు వసంత్‌మనోహర్, కోశాధికారి రమేష్, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేద యువతి వివాహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్ రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన మణెమ్మ, యాదయ్య దంపతుల కూతురు రజిత వివాహానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన గురువారం పార్టీ నాయకులకు చెప్పి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన ఆయిల్ రాఘవేందర్ కుటుంబానికి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్, మైనార్టీసెల్ అధ్యక్షుడు ఆరిఫ్, రవికుమార్, ఆంజనేయులు, ఎల్లయ్య, రామస్వామి, అశోక్, రవి, అంజయ్య, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహం ఏర్పాటును అడ్డుకోవడంతో ఉద్రిక్తత



విగ్రహం ఏర్పాటు పనులను అడ్డుకున్న బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో మహాత్మా బసవేశ్వర విగ్రహం వద్ద ఏపీకి చెందిన దివంగత నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కొందరు గురువారం పనులు ప్రారంభించగా, మహాత్మా బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బసవేశ్వరుని విగ్రహం వద్ద మరో విగ్రహాన్ని ఎలా పెడతారంటూ వారు అభ్యంతరం చెప్పారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొనగా, సమాచారం అందుకున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. దిమ్మె నిర్మాణానికి పూనుకున్న వారిని అక్కడి నుంచి పంపించివేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి విగ్రహాలు పెట్టడానికి వీలులేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలీసులకు, తహసీల్దార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బసవేశ్వర సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుశాల్ కుమార్, సంయుక్త కార్యదర్శి సంతోష్ నీలకంఠ, ఎం.ఎస్.కుమార్, అంజయ్య పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఉదయ నగర్ కాలనీకి చెందిన మారోజు గోదావరమ్మ గురువారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నాగిళ్ల జగన్ పరామర్శించి ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, వినోద్, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.

వైకుంఠ దర్శనానికి ఆలయాలు ముస్తాబు



పహాడీషరీఫ్: ముస్తాబైన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం



మీర్‌పేట: జిల్లెలగూడ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన క్యూ లైన్లు

- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు
- ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూలు

పహాడీషరీఫ్: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మామిడిపల్లిలోని ప్రాచీనమైన బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. దాతల సహకారంతో రంగులేసి అదనపు ఆకర్షణ ఇచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల వెంకటేశ్ వాల్మీకి, ఈఓ మురళీ కృష్ణ, దాతల పర్యవేక్షణలో వైకుంఠ ఏకాదశికి సంబంధించిన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. శనివారం తెల్లవారుజామున ఉత్తర ద్వార ప్రవేశాన్ని కల్పించనున్నారు. అనంతరం ఉదయం 4.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, అర్చనలు కొనసాగనున్నాయన్నారు. సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గరుడ వాహన సేవ ఊరేగింపు నిర్వహించనున్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండడంతో పార్కింగ్ సమస్య తలెత్తకుండా ఆలయం చుట్టూ పరిసరాలను చదును చేస్తున్నారు.



మీర్‌పేట: మత్స్యావతార వేంకటేశ్వర స్వామి

శిల్పకళా వైభవానికి నిదర్శనం

చుట్టూ పంట పొలాలు.. కొండలు.. గుట్టలు.. కోనేరుల నడుమ ప్రశాంత వాతావరణంలో మామిడిపల్లి బాలాజీ వేంకటేశ్వర స్వామి వారు కొలువుదీరారు. దాదాపు ఐదారు వందల ఏళ్ల క్రితం నిర్మించిన ఈ ఆలయం నాటి శిల్ప కళా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. పూర్తి రాతి కట్టడంతో కట్టిన ఈ ఆలయ నిర్మాణం భక్తులను కట్టి పడేస్తుంది. స్వామి వారి ఆలయ మండపాన్ని మొత్తం 30 రాతి స్తంభాలతో నిర్మించారు. ఈ స్తంభాలు సైతం పద్మములచే లిఖించబడి ఉన్నాయి. ఆలయ మండపం ఎదుట రాతితో శ్రీకుర్మం (తాబేలు) ముద్రించారు. ఇలాంటి శ్రీకర్మం ప్రాచీనమైన ఆలయాలకే ప్రత్యేకంగా ఉంటుంది. ఆలయం బయట ఉన్న కోనేరు పూర్తి రాత్రి కట్టడంతో నిర్మించిన ప్రాచీనమైనది. అన్ని కాలాల్లోనూ నీరు సమృద్ధిగా ఉండడం ఈ కోనేరు ప్రత్యేకత.

అదనపు సొబగులతో పెరిగిన తాకిడి

2020 లాక్‌డౌన్ నుంచి ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణంలో చక్కటి పార్కు ఏర్పాటు, స్వాగత కమాన్, కోనేరుపై అమ్మవారి విగ్రహం, గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం, ఆలయ ప్రాకారంపై దశావతరాల నిర్మాణం, గర్భగుడిపై ప్రాకారం నిర్మించి ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఈ అదనపు సొబగులతో ప్రస్తుతం ఆలయానికి భక్తుల తాకిడి పెరిగి.. దేవాదాయ శాఖకు ఆదాయం భారీగా సమకూరుతోంది. ఇక్కడ సీరియల్ షూటింగ్‌లు, ప్రత్యేక పాటల షూట్‌లు నిత్యం జరుగుతుంటాయి.

సిద్ధమైన తొలి ఉత్తరద్వార ఆలయం

మీర్‌పేట: దేశంలోనే ఉత్తర ద్వారంలో వెలసిన ఏకైక వేంకటేర్వరాలయం వైకుంఠ ఏకాదశికి సిద్ధమైంది. జిల్లెలగూడలోని అతి పురాతన శ్రీ మత్స్యేతార వేంకటేశ్వర స్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ స్వామివారు నిత్యం ఉత్తర ద్వారా దర్శనం ఇస్తారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా తాత్కాలికంగా క్యూలు సిద్ధం చేసినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక

కడ్తాల్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కడ్తాల్‌కి చెందిన వెంకటరమణ నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఆ సంఘం కల్వకుర్తి ఇన్‌చార్జి యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో గురువారం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా శ్రీకాంత్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ టీఎస్ మాదిగ దండోరా జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు కమిటీని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం నూతన కమిటీకి నియామకపత్రాలు అందజేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ

యాచారం: మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. ఆర్టీసీ అధికారులు కొన్ని బస్సుల ట్రిప్పులను రద్దు చేశారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి గ్రామం మీదుగా నానక్‌నగర్, తాడిపర్తి, పల్లెచల్కతండా వరకు, మాల్ నుంచి మంతన్‌గౌరెల్లి వరకు, మొండిగౌరెల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి తదితర గ్రామాలకు బస్సుల ట్రిప్పులను రద్దు చేసింది. సాగర్‌రోడ్డుపై దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రతి పావుగంటకు ఒక బస్సు చొప్పున రాకపోకలు సాగించేది. ప్రస్తుతం దేవరకొండ డిపోకు చెందిన బస్సులు అరగంట దాటినా కూడా రావడం లేదు. ఉచిత ప్రయాణం, బస్సులు కూడా తగ్గించడంతో ప్రయాణికుల రద్దీ అధికంగా మారింది. సమయానుకులంగా బస్సులు రాకపోవడంతో యాచారం, మాల్ కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కూల్‌డ్రింక్స్‌తో నాడీ వ్యవస్థకు ముప్పు



వైద్య శిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

లయన్స్‌క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి

కందుకూరు: ప్రతీ ఒక్కరు కాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. లయన్స్‌క్లబ్ కందుకూరు అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని భూలక్ష్మి ఆస్పత్రిలో కీళ్ల నొప్పులు, న్యూరో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక జీవన విధానంలోని ఆహార అలవాట్ల వల్ల ఎముకలకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. పాలు, పెరుగు వాడకం తగ్గడం.. కూల్‌డ్రింక్స్ వినియోగం పెరగడంతో ఎముకల పటిష్టత, నాడీ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందన్నారు. కాల్షియం ఉండే పాలు, ఆకుకూరలు, గుడ్లు, క్యాబేజీ, కాలిఫ్లవర్, నువ్వులు తదితరాలు ఆహారంలో ఉండేట్లు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కందుకూరు మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, బైరు కొండల్‌రెడ్డి, టంకరి కేశవరెడ్డి, సురసాని వెంకట్‌రంగారెడ్డి, గంట రాంరెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి జి.రామస్‌బాబు, దేశం సత్తిరెడ్డి, దేశం మోహన్‌రెడ్డి, ఎండీ అజీజ్, వైద్య సిబ్బంది శ్యాముల్, శ్రీనివాస్, మాన్‌కైండ్ కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



కూల్చివేతల అనంతరం ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

పహాడీషరీఫ్: కబ్జాలపై ఎట్టకేలకు అధికారులు కన్నెర్ర చేశారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న వైనంపై 'సాక్షి' దినపత్రికలో 'యథేచ్ఛగా కబ్జాల పర్వం' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బాలాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ మాధవిరెడ్డి ఆదేశాలతో ఆర్.ఐ జమీల్ గురువారం ఉదయాన్నే కబ్జాకు గురైన సర్వే నంబర్ 99/1లోని స్థలానికి చేరుకొని పహాడీషరీఫ్ పోలీసులు, జల్‌పల్లి మున్సిపాలిటీ, విద్యుత్ అధికారుల సహకారంతో జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. అనంతరం ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. హౌజింగ్ బోర్డుకు కేటాయించిన భూమిలో అర ఎకరం మేరకు నిర్మాణాలు చేపట్టారని, ఇందులో పది వరకు నిర్మాణాలను కూల్చామని తహసీల్దార్ మాధవిరెడ్డి తెలిపారు. మిగిలిన నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కబ్జారాయుళ్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూము ల కబ్జా వ్యవహారాన్ని వెలుగులోకి తీసుకుకొచ్చిన 'సాక్షి' కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆక్రమణలు తొల గించేలా చొరవ చూపి విలువైన భూమికి విముక్తి కల్పించిన సాక్షి పత్రికకు గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

మంత్రి పొన్నంకు సత్కారం



మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ఉద్యమకారుడు, పోరుబిడ్డ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గురువారం శ్రీనూతన గౌడ్ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ, పొన్నం ప్రభాకర్ ధైర్యశాలి అని, తెలంగాణ ఉద్యమంలో ముందు వరసలో ఉండి రాష్ట్ర సాధన కోసం పోరాడన్నారు. కార్యక్రమంలో శ్రీ నూతన గౌడ సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు మామిడి రామకృష్ణ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మిట్టపల్లి విజయ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తుల రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, ఆర్గనైజర్ శ్రీ ప్రగతి గౌడ్, గౌరవ అధ్యక్షుడు మొగిలి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఇరుముడి పూజ

యాచారం: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఇరుముడి పడిపూజను గురువారం వైభవంగా నిర్వహించారు. కుమ్మరిగూడెం పురుషోత్తం 18వ సారి అయ్యప్ప మాలధారణ పూర్తికావడం, అదేవిధంగా 30మంది అయ్యప్పస్వామి మాల ధరించిన వారు ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుమల దేవునిగుట్ట సమీపంలోని అయ్యప్ప స్వామి సేవా సమితి క్షేత్రంలో చందర్‌నాయర్ గురుస్వామి పర్యవేక్షణలో నారాయణ శెట్టి గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి పూజను ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మాలధారణ చేసిన అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం నిర్వహించారు.

24న ఇంజినీర్స్ కమిటీ సమావేశం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్లు కాలనీ సమన్వయకమిటీ కో కన్వీనర్ వి.అల్వాల్‌రెడ్డి వెల్లడించారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు కోసం రెండు సార్లు సమావేశాలు నిర్వహించినా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈనెల 24న జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సమన్వయ కమిటీ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ కమిటీ తీర్మానం మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేయడానికి నిర్వహించే కాలనీ సర్వసభ్య సమావేశానికి సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గుడిసె వాసులకు న్యాయం చేస్తాం

హయత్‌నగర్: జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు పక్కన వేసుకున్న నివాసాలు కోల్పోతున్న వారికి తగిన న్యాయం చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని రేడియో స్టేషన్ పక్కన గుడిసెలు వేసుకొని ఉంటున్న వారు నివాసాలు కోల్పోతున్నారని తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో క్రీడా పక్కన గుడిసెలు ఉండగా, అక్కడ బస్ టెర్మినల్ ప్రతిపాదన రావడంతో అక్కడి నుంచి గుడిసెలను ఇక్కడికి తరలించామన్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించామని, వారు వ్యాపారం చేసుకునే విధంగా సహకరించామన్నారు. ఉన్నఫలంగా వారిని ఖాళీ చేయమని అధికారులు గుడిసెలను తొలగిస్తున్నారన్నారు. వారికి న్యాయం చేయాలని గతంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, మరోసారి కలెక్టర్‌తో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



గుడిసెల వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మద్యం షాపుల అనుమతి రద్దు చేయాలి

వైన్ షాపు ఎదుట బీజేపీ ఆందోళన

హయత్‌నగర్: కాలనీకి వెళ్లే దారిలో వైన్స్, బార్‌లు ఏర్పాటు చేస్తున్నారని, కాలనీ వాసులకు ఇబ్బంది కలిగించే మద్యం షాపుల అనుమతులను రద్దు చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం వీరభద్రానగర్ కాలనీవాసులతో కలిసి బీజేపీ నాయకులు మద్యం షాపు ముందు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి మాట్లాడుతూ... కాలనీకి వెళ్లే నాలుగు రహదారుల్లో వైన్స్, బార్‌లకు లైసెన్సులు ఇచ్చారని, ఆయా షాపుల కారణంగా నిత్యం మద్యం ప్రియుల ఆగడాలతో కాలనీవాసులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. మద్యం షాపుల కారణంగా కాలనీలోని మహిళలు, విద్యార్థులు సాయంత్రం పూట బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. కాలనీ వాసులు గతంలో కూడా వ్యతిరేకించినా అధికారులు పట్టించుకోలేదని, ఈసారి మరో బార్‌కు అనుమతిచ్చారని అన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి మద్యం షాపుల లైసెన్సులను రద్దు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఉగాది ఎల్లప్ప, పొరండ మహేష్, సత్యనారాయణ, గోవిందా చారి, వెంకటేష్, జనార్దన్, కాలనీ వాసులు అజయ్, స్వామిగౌడ్, విజయ్ పాల్గొన్నారు.



వీరభద్రనగర్ కాలనీ వాసులతో కలిసి మద్యం షాపు ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఆస్తి పన్ను వసూళ్లపై ఎన్నికల ఎఫెక్ట్

- ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్లలో పన్ను టార్గెట్ రూ.212.20 కోట్లు
- ఇప్పటి వరకు వసూళ్లు రూ.103.94 కోట్లు
- మిగతా రూ. 108.26 కోట్ల కోసం కసరత్తు



ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయం

ఎల్‌బీనగర్: ఎన్నికల వేళలో ఆస్తి పన్ను వసూళ్లలో వేగం తగ్గింది. అధికారులు, సిబ్బంది అంతా ఎన్నికల విధుల్లో ఉండటంతో పన్ను వసూళ్లను అంతగా పట్టించుకోలేదు. దీంతో ఆస్తి పన్ను వసూలు మందగించిందనే చెప్పవచ్చు. ఈ నేపథ్యంలో ఈ ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను టార్గెట్‌ను పూర్తి చేస్తారో.. లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

- ఆస్తి పన్ను చెల్లింపు గడువు మార్చి నెలఖారుకు ముగుస్తుండటంలో ఎల్‌బీనగర్ సర్కిళ్ల అధికారులు తమ తమ టార్గెట్లను చేరుకునేందు ముమ్మర కసరత్తు చేస్తున్నారు.
- మూడు సర్కిళ్ల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరం వసూళ్ల టార్గెట్ రూ. 212.20 కోట్లు కాగా, ఇప్పటి వరకు రూ.103.94 కోట్లు వసూలు చేశారు. మిగిలిన రూ.108.26 కోట్లు వసూలు చేసేందుకు అధికారులు తీవ్రంగా కష్ట పడాల్సి ఉంది.
- మరో రెండు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల సమీస్తుండటంతో ఇప్పటికే అధికారులు, సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సిబ్బంది ఒక వైపు ఎన్నికల విధులు, మరోవైపు ఆస్తి పన్ను వసూళ్ల కోసం తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది.
- ఇక ఆస్తి పన్నులు భారీగా బకాయి ఉన్న వారికి రెడ్ నోటీసులు జారీ చేసి అనంతరం వారెంట్ జారీ చేసి.. ఆ తర్వాత కూడా పన్నులు చెల్లించకుంటే జప్తు మంత్రం ఉపయోగించి పన్నులను రాబట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

మూడు సర్కిళ్లలో వసూళ్ల వివరాలు ఇలా....

ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిస్తుంది. దీంతో గడువుకు ముందే తమ టార్గెట్‌ను పూర్తి చేయాలని అధికారులు అనుకుంటున్నారు. ఇక సర్కిళ్ల వారీగా ఈ ఆర్థిక సంవత్సరం టార్గెట్‌ను పరిశీలిస్తే సర్కిల్-3లో రూ 74.01కోట్లు కాగా, ఇప్పటి వరకు వసూలు చేసింది రూ. 36.05కోట్లు.

- సర్కిల్ -4లో రూ.62.56కోట్లు కాగా, ఇప్పటికి రూ.31.15 కోట్లు వసూలు చేశారు.
- సర్కిల్-5లో రూ. 75.63 కోట్లు కాగా, వసూలు చేసింది రూ.36.74కోట్లు.
- మూడు సర్కిల్‌లో మిగిలిన రూ. 108.26 కోట్ల పన్నుల వసూలుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.